సాక్షి వికారాబాద్

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



నీటి సరఫరాకు చర్యలు

జిల్లాలో తాగునీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 8లో▸



ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి విమర్శించారు. 8లో▸



కరెంటు కష్టాలు మొదలు

పది రోజుల నుంచి కరెంటు సరఫరా సక్రమంగా లేకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన 2008 డీఎస్సీ అభ్యర్థులు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

అనంతగిరి/తాండూరు టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో బుధవారం 2008 డీఎస్సీలో ఎంపికైన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు కలిశారు. 2008 డీఎస్సీలో తాము ఎంపికైనా ప్రైవేట్ డీఎడ్ చేశారనే కారణంతో ఉద్యోగాలు ఇవ్వలేదని సీఎంకు వివరించారు. అప్పట్లో కోర్టు ఆర్డర్ ద్వారా పరీక్ష రాసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం తమ విన్నపాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభు త్వం న్యాయం చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో రఘు, రాంప్రసాద్, కిషోర్, అశోక్, రవి, శ్రీనివాస్, కరుణాకర్, సునీత, అనంతలక్ష్మి, లత తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలి రూ.600లకు పెంచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



కూలీలతో మాట్లాడుతున్న మహిపాల్

మర్పల్లి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం కూలి రూ.600లకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సిరిపురంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, నీడ కోసం టెంట్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. 2022 – 23 సంవత్సరానికి సంబంధించి తొమ్మిది వారాల కూలి డబ్బు పెండింగ్‌లో ఉందని వెంటనే చెల్లించాలని కోరారు. బ్యాంకు సిబ్బంది కూలీలకు డబ్బులు ఇవ్వకుండా వారి ఖాతాలను హోల్డ్‌లో పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని, సీనియర్ మేట్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మానయ్య, పద్మారావు, పాపారావు, శ్రీను, బాల్‌రాజ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కుల్కచర్ల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాంబండ రామలింగేశ్వర స్వామికి 11రోజుల పాటు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ చైర్‌పర్సన్ నర్సమ్మ, ఈఓ సుధాకర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. కానుకల రూపంలో రూ.5లక్షల 81వేల 701రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కోడెల విక్రయం ద్వారా రూ. 36,500 ఆదాయం వచ్చింది. హుండీ ఆదాయం లెక్కింపు పర్యవేక్షకులుగా రేణుక ఎల్లమ్మ ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకన్న, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు దశరథం, పాండు శర్మ, శ్రీ సాంబశి వాణి సేవా సంస్థ తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

సూర్యప్రభ వాహనంపై బద్రీనారాయణుడు

పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి బుధవారం సూర్యప్రభ వాహనంపై బద్రీనారాయణుడి అవతారంలో దర్శనమిచ్చారు. సూర్యదేవా నమో నమః అంటూ భక్తులు పరవశించిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవేరుల సమేతంగా మలయప్ప స్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి స్వామి వారు గజ వాహనంపై విహరించారు.

– కొడంగల్



గజ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు


ఎన్నికలగానే హామీలు!

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అధికార, ప్రతిపక్ష నాయకులకు జిల్లాపై ఎనలేని ప్రేమ పుట్టుకొస్తుంది.. హామీలు గుప్పించడం.. ఆ తరువాత వాటిని పట్టించుకోకపోడం పరిపాటిగా మారింది.. ఎత్తిపోతల పథకాలు.. సాగునీటి ప్రాజెక్టులు.. రవాణా వ్యవస్థ.. పారిశ్రామిక వాడల ఏర్పాటు ఇలా ఒక్కటేమిటి అన్నీ అటకెక్కాయి.. ప్రధాన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చకపోవడంతో జిల్లా అభివృద్ధి ఒక్క అడుగు ముందుకు.. ఆరు అడుగుల వెనక్కు అన్నట్లు తయారైంది.

జిల్లాలో పట్టాలెక్కని ప్రధాన పథకాలు

- 'పాలమూరు' ఉత్తిపోతలే..
- ప్రాణహిత – చేవెళ్ల కథ కంచికేనా?
- డిజైన్ మార్పుతో పశ్చిమ జిల్లాలకు అన్యాయం
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ తెరపైకి..
- వికారాబాద్ – పరిగి – కృష్ణా రైల్వే లైన్‌దీ అదే పరిస్థితి
- రాకంచర్ల, నంచర్ల పారిశ్రామిక పార్కులకు ఆదిలోనే హంసపాదు
- కలగా మిగులుతున్న తాండూరు కంది బోర్డు ఏర్పాటు

వికారాబాద్: నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిస్థితి దీపం చుట్టూ చీకట్లే అన్న చందంగా తయారైంది. జిల్లా అభివృద్ధిలో ఏ మాత్రం పురోగతి కనిపించడం లేదు. దశాబ్దాలుగా పాలకుల పాపం.. నోరు మెదపని నేతల చేతగానితనం జిల్లా ముఖచిత్రంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చిన్న చిన్న చెరువులు మినహా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా లేని.. నదుల ద్వారా సెంటు భూమి కూడా తడవని.. పరిశ్రమలు లేని జిల్లా ఏదైనా ఉందంటే.. అది వికారాబాదే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. జిల్లా రూపు రేఖలు.. స్థితిగతులు మార్చి ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాయనుకున్న ప్రాజెక్టులు.. అభివృద్ధి పనులన్నీ ఎన్నికల హామీలుగానే మిగిలిపోతున్నాయి. ఇప్పుడు మళ్లీ లోక్‌సభ ఎన్నికలు రావడంతో ప్రాజెక్టులన్నీ నేతలకు గుర్తుకు వస్తున్నాయి.



పాలమూరు ఎత్తిపోతల పథకం

కొర్రీలు పెట్టి కొండెక్కించి..

జిల్లాకు చెందిన ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ ఏదో ఒక కొర్రీ పెట్టి కొండెక్కిస్తున్నారే తప్ప చిత్తశుద్ధితో వాటిని పూర్తి చేయడంలేదు. పలు సార్లు సర్వేలు.. రీ డిజైన్లు.. కేసులు అంటూ పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దశాబ్దాలుగా సర్వేలు.. ఎన్నికల హామీలకే పరిమితం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 50 టీఎంసీల నీటి కేటాయింపు ఉన్న ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో అటకెక్కించి జిల్లాకు మొండిచేయి చూపించారు. పూడూరు మండలం రాకంచర్ల ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కు కోసం పేదలకు అతి తక్కువ ధర చెల్లించి 100 ఎకరాల భూమి తీసుకొని హడావుడిగా ప్రారంభించారు. అయితే స్థానికులకు పని కల్పించలేదు. కేవలం రెండు చిన్న పరిశ్రమలతో సరిపెట్టారు. గండేడ్ మండలం నంచర్ల గ్రామంలో పారిశ్రామికవాడ శిలాఫలకానికే పరిమితమైంది. వికారాబాద్ – పరిగి – కొడంగల్ మీదుగా మక్తల్ వరకు వికారాబాద్ – కృష్ణా రైల్వే లైన్ సర్వేలు దాటడం లేదు. తాండూరులో కంది బోర్డు ఏర్పాటు ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. రెండేళ్ల క్రితం మన్నెగూడ – హైదరాబాద్ హైవే నిర్మాణానికి టెండర్లు పిలిచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

సర్వేలు దాటని 'పాలమూరు'

ఏ ప్రభుత్వం వచ్చినా పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నాన్చుతూ వస్తోంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఉమ్మడి పాలకుల సంప్రదాయాన్నే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కొనసాగించింది. అనేక సర్వేలు డిజైన్ మార్పులతో కాలం నెట్టుకొచ్చింది. పదేళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు సర్వే కోసం రూ.6.91 కోట్లు కేటాయించింది. నిపుణులతో సర్వే చేయించి డిజైన్ వివరాలు వెల్లడించింది. ఈ ఎత్తిపోతల పథకానికి 115 టీఎంసీల నీటిని కేటాయించగా అందులో 45 టీఎంసీల కెపాసిటీ నీటితో పరిగి నియోజకవర్గంలోనే రిజర్వాయర్లు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో గండేడ్, కుల్కచర్ల మండలాల పరిధిలో 35 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్, అలాగే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన లక్ష్మీదేవిపల్లి, పరిగి మండలం రావులపల్లి శివారులో జాయింట్‌గా 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే జిల్లాలో 2,46,154 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. అయితే గత బీఆర్ఎస్ సర్కారు అనేక సార్లు డిజైన్ మారుస్తూ వెళ్లింది. చివరకు జిల్లాకు గ్రావిటీ ద్వారానే నీళ్లు ఇస్తామని చెప్పారే తప్ప అది కూడా పూర్తి చేయలేదు.



ప్రారంభానికి నోచుకోని మన్నెగూడ - హైదరాబాద్ హైవే పనులు

మళ్లీ తెరపైకి 'ప్రాణహిత - చేవెళ్ల'

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రధాన ప్రాజెక్టుల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికే పరిమితమయ్యారు తప్ప ప్రాజెక్టు పనులు జిల్లా వరకు చేరలేదు.



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, ముస్లిం మత పెద్దలు

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు: రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం పాత తాండూరు, రాజీవ్ గృహకల్ప వద్ద గల ఈద్గాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈద్గాల వద్దకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా 200 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సంతోష్, అశోక్ కుమార్, విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఈద్గాలు ముస్తాబు

రంజాన్ పర్వదినానికి ఈద్గాలు ముస్తాబయ్యాయి.. బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో 30 రోజుల ఉపవాస దీక్షలను విరమించారు. గురువారం పండుగ జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలు నిర్ణయించారు. తాండూరు శివారులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వేలాది సంఖ్యలో ముస్లింలు రానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి



తాండూరులోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకపోవడం దారుణం
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు టౌన్: కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి అని, 12 శాతానికి పైగా ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ ధ్వజమెత్తారు. బుధవారం ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో నిరశన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా అవమాన పరిచారని అన్నారు. దళితుల్లో 75శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం సరికాదన్నారు. కేవలం 20శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, ఊరుకొక్కరు కూడా లేని బైండ్ల కులానికి ఒక్క సీటు ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ స్థానాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడైన మల్లు రవికి కేటాయించడం, బైండ్ల కులానికి చెందిన కడియం శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ స్థానం కేటాయించడం, చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలుగా ఉన్న గడ్డం వివేక్, గడ్డం వినోద్ కుమారునికి పెద్దపల్లి ఎంపీ సీటు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించి, మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పది రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ప్రకాష్, ఉమాశంకర్, కృష్ణ, మహేందర్, వెంకట్, శేఖర్, పరశురాం, దాసు, సత్యానంద్, భరత్, మహేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వేడెక్కుతున్న రాజకీయం

- లోక్‌సభ ఎన్నికల్లో కొడంగల్‌పై నేతల ప్రత్యేక దృష్టి
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్

కొడంగల్: మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. నియోజకవర్గంలో రాజకీయ ఎత్తుగడలు రసవత్తరంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా, సొంత నియోజకవర్గం పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఉండటంతో ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. లోక్‌సభ స్థానం గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డికి 33 వేల మెజారిటీ వచ్చింది. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో 50వేలకు తగ్గకుండా మెజారిటీ రావాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గంలోని 8 మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మండలాలు, పోలింగ్ బూత్‌ల వారీగా సమీక్ష నిర్వహించారు.



కొడంగల్‌లో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం (ఫైల్)

పుంజుకుంటున్న బీజేపీ

పాలమూరు పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ జోరుగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారు. ఇప్పటికే కోస్గి, గుండుమాల్, దుద్యాల, మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ముఖ్య నాయకులు బీజేపీలో చేరడానికి సిద్ధమయ్యారు. సీఎం రేవంత్ ఇలాఖాలో పట్టు సాధించాలని బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు పార్లమెంట్ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తున్నారు. తనను ఓడగొట్టడానికి, పడగొట్టడానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని సాక్షాత్తు ముఖ్యమంత్రే రెండు రోజుల క్రితం కొడంగల్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నారు. మత రాజకీయాలకు లొంగవద్దని ఆయన ప్రజలకు సూచించారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ (ఫైల్)

పాలమూరు పార్లమెంట్ పరిధిలోకి వచ్చే నియోజకవర్గాలు..

కొడంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకంద్ర, మక్తల్, షాద్‌నగర్

2019లో ఎంపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

- మన్నె శ్రీనివాస్‌రెడ్డి (టీఆర్ఎస్) 4,11,402
- డీకే అరుణ (బీజేపీ) 3,33,573
- వంశీచందర్‌రెడ్డి (కాంగ్రెస్) ,93,631
- 2019లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ అభ్యర్థి డీకే అరుణపై 77,829ఓట్ల మెజారిటీతో గెలిచారు. 7.90 శాతం ఓట్లు బీఆర్ఎస్‌కు అధికంగా వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో బలం పెంచుకోడానికి బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు.

ప్రచారంలో వెనుకబడిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ అధిష్టానం పాలమూరు ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డినే మళ్లీ పోటీలో నిలిపింది. 2019లో గెలిచింది మొదలు ఆయన నియోజకవర్గంలో పర్యటించలేదు. ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్నా నేటికీ నియోజకవర్గానికి రాలేదు. ప్రచార రథాలు కూడా కనిపించడం లేదు. చివరకు ఆయన పోటీలో ఉంటారో లేదోనని బీఆర్ఎస్ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కుల్కచర్ల: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి21న సుమారు 60సంవత్సరాల వ్యక్తి హైబీపీతో కిందపడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పరిగి, ఆ తరువాత జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. అతని గురించి ఎవరూ రాకపోవడంతో మృతదేహాన్ని గురువారం వరకు అందుబాటులో ఉంచి, అనంతరం అంత్యక్రియలు చేయనున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


మృతుడు మహేశ్ (ఫైల్)

కుల్కచర్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలాపూర్ గ్రామపంచాయతీ ఇప్పాయిపల్లి గేట్‌కి చెందిన పసుల మహేశ్(32) చౌడాపూర్ గ్రామంలోని ఫర్టిలైజర్ రూమ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఘండి చెరువు ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేశ్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన కొందరు, కుటుంబీకులకు సమాచారం అందించగా.. వారు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

ప్రయాణ ప్రాంగణాల్లో తనిఖీలు


వికారాబాద్ బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న బీడీ టీం

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్లలో బాంబు డిటెక్షన్ టీం (బీడీ) తనిఖీలు చేపట్టింది. జిల్లాలో ఎక్కడైనా అక్రమ రవాణా, అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే స్థానిక పోలీసులకు లేదా 100కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

పాఠశాలలో చోరీ

ఆట వస్తువుల అపహరణ

పెద్దేముల్: గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో చోరీకి పాల్పడి, సుమారు రూ.10వేల విలువగల ఆట వస్తువులను అపహరించారు. ఈ సంఘటన జనగాం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి జనగాం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నర్సింలు ఈ నెల 8న మధ్యాహ్నం 12గంటల తరువాత తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉగాది సెలవుదినం. బుధవారం ఉదయం 7.30 గంటలకు పాఠశాలకు వచ్చి చూడగా ఆఫీస్ రూమ్ తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. రెండు ఇనుప పెట్టెలు, బీరువా తెరచి ఉంది. పది రోజుల క్రితం స్కూల్ గ్రాంట్ నిధులతో కొనుగోలు చేసిన రూ.10వేల క్రీడా సామగ్రి (స్పోర్ట్స్ మెటీరియల్) చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో హెచ్ఎం నర్సింలు.. మండల విద్యాధికారి వెంకటయ్యకు ఫోన్ ద్వారా విషయం చెప్పారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముగ్గురు విద్యార్థినుల అస్వస్థత

- కలుషితమైన భోజనం, నీరుతో ఆస్పత్రి పాలైన బాలికలు
- 'జిప్సం' కర్మాగారం దుర్వాసనతో ఇంటిబాట పడుతున్న స్టూడెంట్స్
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు

తాండూరు రూరల్: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో బాలికల హాస్టళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వసతి గృహాల్లో సరైన వసతులు, భోజనం, తాగునీరు లేకపోవడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారు. పరిసరాల పరిశుభ్రత సరిగ్గా లేక దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల బారిన పడుతున్నారు. బుధవారం వేర్వేరు చోట్ల ముగ్గురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అందులో ఒక బాలికను మెరుగైన వైద్యం కోసం నగరంలోని నిలోఫర్‌కు తరలించారు.

ఫిర్యాదు చేస్తే ఏం అవుతుందో..

మండల పరిధి చెన్‌గేస్‌పూర్ మార్గంలోని జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహానికి చెందిన సుమిత్ర, మౌనిక ఐదో తరగతి చదువుతున్నారు. బుధవారం ఇద్దరూ కడుపు నొప్పితో బాధపడ్డారు. సుమిత్రను తాండూరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మరో విద్యార్థిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. పూలే వసతి గృహంలో బాలికలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యతలేని భోజనం, కలుషితమైన నీరుతో తరచూ అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే హాస్టళ్లలో సౌకర్యాలు లేక ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని విద్యార్థినీలు వాపోతున్నారు. ఫిర్యాదు చేస్తే ఏం అవుతుందేమోనని బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు.

నిలోఫర్‌లో మరో విద్యార్థిని

మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన అలేఖ్య జినుగుర్తి గేటు వద్ద ఉన్న కేజీబీవీలో 6వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్లో ఉంటోంది. నాలుగు రోజుల నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ప్రైవేట్‌తో పాటు జిల్లా ఆస్పత్రిలో అలేఖ్యకు కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయితే ఆమె రక్తహీనతతో బాధపడుతుందని, మెరుగైన వైద్యం కోసం నిలోఫర్‌కు రిఫర్ చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. కేజీబీవీల్లో నాసిరకమైన భోజనం, అపరిశుభ్రత వాతావరణంతో బాలికలు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేజీబీవీ సమీపంలో జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో వారం రోజుల క్రితం పలువురు విద్యార్థినిలు అనారోగ్యానికి గురై హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిపోతున్నట్లు సమాచారం.

బయట ఫుడ్‌తో ఇబ్బంది

జ్యోతిరావు పూలే వసతి గృహంలో ఉన్న సుమిత్ర, మౌనికలు బయట భోజనం చేయడంతో అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. హాస్టల్‌లో భోజనం బాగుంటుంది. మేము ఇక్కడే ఉంటాం. మా ఉపాధ్యాయులు కూడా ఇక్కడే భోజనం చేస్తారు. తల్లిదండ్రులు బయట ఫుడ్ తెచ్చిపిల్లలకు పెట్టడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు.

– నాన్సీ, ప్రిన్సిపాల్, జ్యోతిరావుపూలే, తాండూరు

నాణ్యమైన భోజనం వడిస్తున్నాం

అలేఖ్యకు ఆరోగ్యం బాలేదని గత నెల 28న ఆమె తల్లి ఇంటికి తీసుకెళ్లారు. బాలికలను హైదరాబాద్‌కు తరలించిన విషయం మాకు తెలియదు. మా పాఠశాల్లో నాణ్యమైన భోజనం వడిస్తున్నాం.

– విజయ, ప్రిన్సిపాల్, కేజీబీవీ పాఠశాల, జినుగుర్తి గేటు

తాగునీటి సరఫరాకు తక్షణ చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం:
- వీసీలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

అనంతగిరి: తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీటి సరఫరాపై ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామాలకు తాగునీటి సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆశ వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పేర్కొన్నారు. వీసీలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీఓ జయసుధ, డీఈఓ రేణుకాదేవి, డీఆర్డీఓ శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయి, డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, మిషన్ భగీరథ ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన షాద్‌నగర్ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నయామొద్దీన్ వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌సలీం(49) పాత సామాను(స్క్రాప్) దుకాణం నిర్వహిస్తున్నాడు. షాద్‌నగర్‌కు వచ్చి, కాలి నడకన ఇంటికి వెళ్తుండగా.. కంటైనర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సలీ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నృసింహుడి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు


యాదగిరి గుట్టపై ఎమ్మెల్యే దంపతులు

తాండూరు టౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనృసింహ స్వామిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో బీఎమ్మార్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. వేద పండితులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. నృసింహుడు ఎంతో మహిమాన్వితుడని, ఆయనను దర్శించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించు అని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

కష్టపడేవారికే పదవులు


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణంరాజు

కొడంగల్: కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికే పార్టీ పదవులు, అధికార పదవులు లభిస్తాయని పార్టీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, తాలూకా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఎం రేవంత్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ మహబూబ్‌నగర్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో పది వేల మందితో సభ్యత్వం చేయిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని, పార్టీ పరంగా ఐఫోన్ బహుమతిగా వస్తుందని, యువజన కాంగ్రెస్ తరపున ఒకరికి మోటార్ సైకిల్‌ను బహుమతిగా ఇస్తామని రాజు పేర్కొన్నారు. అంతే కాదు.. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కొడంగల్‌కు రూ.5వేల కోట్లు మంజూరు చేయడంతో పాటు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో యువజన నాయకులు భీంరాజ్, బంటు రాజగోపాల్, రవీందర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింలు, సందీప్, రవికుమార్, ప్రకాశ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత

- ఎంపీ రంజిత్‌రెడ్డిది స్వార్థ రాజకీయం
- కాసానిని గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పండి
- కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే హామీల అమలులో విఫలమై ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల వికారాబాద్ కోఆర్డినేటర్ పి.కార్తీక్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత.. ప్రజలు పాత ప్రభుత్వమే ఉంటే బాగుండేదన్న ఆలోచనకు వచ్చారని వెల్లడించారు. ప్రజలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రంజిత్‌రెడ్డి స్వార్థం కోసం పార్టీ మారారని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీ గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఏ ఒక్క హామీ పూర్తి చేయలేదని, రూ.500 గ్యాస్, ఉచిత కరెంట్, రైతుబంధు ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో చేసిన వ్యాఖ్యలతోనే తాను బలహీనంగా ఉన్నానని చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు. సీఎం ఆధ్వర్యంలో ఒక నాయకుడు పార్టీలో చేరితే, ఆ పార్టీ నాయకులే చెల్లదంటూ చెప్పడం చూస్తుంటే.. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయనేది స్పష్టమవుతుందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న చేవెళ్లలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ భారీ బహిరంగసభ నిర్వహించనున్నారని.. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేసీఆర్ ఫొటోతో గెలిచిన కొండా, రంజిత్

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రాజకీయంగా ఎవరికీ తెలియదని, కేసీఆర్ ఫొటోతోనే గెలిచారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి, బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వికారాబాద్, మర్పల్లి, కోట్‌పల్లి, ధారూరు పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుందరి అనిల్, ఎబ్బనూర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, అనంత్‌రెడ్డి, మేక చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గిరీష్ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దొంగలకు రిమాండ్

కందుకూరు: మోటారు వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ మున్సిపాలటీ పరిధి కొంగర కలాన్‌కు చెందిన తెపర్ల భీమేష్(24), కొత్త యాదయ్య అలియాస్ యాదగిరి(20)తో పాటు మరో బాలుడు(17) కలిసి కందుకూరు, యాచారం మండలాల పరిధిలో తరచూ మోటార్ వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో నిఘా పెట్టిన పోలీసులు.. బుధవారం కందుకూరు చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్: పనికని వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మామిడిపల్లి రంగ నాయకుల కాలనీకి చెందిన సాయి కుమార్(26) సరూర్‌నగర్ శ్రీసాయి సర్జికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ నెల 8న ఉదయం డ్యూటీకి వెళ్లిన సాయి.. తిరిగి ఇంటికి రాలేదు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సాయి తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుబడిన ట్రాక్టర్

పెద్దేముల్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పెద్దేముల్ పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రుక్మాపూర్ నుంచి మంబాపూర్ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధిలో దేశం పరుగు

- బీజేపీ పాలనలో భారత్‌కు పేరుప్రఖ్యాతులు
- మోదీ హ్యాట్రిక్ విజయం ఖాయం
- ప్రజా ఆశీర్వాద యాత్రలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- తనను ఆదరిస్తే.. మోదీని గెలిపించినట్లేనని వెల్లడి


ఆశీర్వాద యాత్రలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: మోదీ పదేళ్ల పాలనలో దేశానికి పేరు ప్రఖ్యాతులు రావడంతో పాటు, ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ భారత్ అభివృద్ధిలో దూసుకుపోతుందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కొండా చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర బుధవారం శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, దోబీపేట్, అలంఖాన్ గూడ, ఫత్తేపూర్, బుల్కాపూర్ మోకిల, ప్రొద్దటూరు, చేవెళ్ల మండలం ఆలూరు, ఎన్కేపల్లి, మీర్జాగూడ, బస్తేపూర్, చనువెల్లి గ్రామాల్లో సాగింది. యాత్రలో కొండా.. ప్రజా సమస్యలు అడిగి తెలుసున్నారు. అనంతరం మాట్లాడారు. యువత మోదీ వేంటే నడుస్తుందని, ఆయన పాలననే దేశ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా తనను ఆదరిస్తే.. కేంద్రంలో మోదీని గెలిపించినట్లేనని, ప్రధానికి చేవెళ్ల సీటును గెలిపించి కానుకగా అందించాలని కొండా సూచించారు.

కేరళకు పారిపోయిన రాహుల్

మోదీ ప్రభంజనాన్ని చూసి రాహుల్‌గాంధీ కేరళకు పారిపోయారని విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రజల మనిషిగా మోదీ పనిచేస్తున్నారన్నారు. రైతులకు రాయితీపై ఎరువులు అందించటంతో పాటు వారు పండించిన పంటలకు మద్దతు ధర, కిసాన్ సన్మాన్ నిధి, పీఎం కిసాన్ ద్వారా పెట్టుబడి సాయం అందజేస్తూ.. అన్నదాతలకు అండగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసినట్లు చెప్పుకొంటున్న అభివృద్ధిలో కేంద్రం నిధులే ఉన్నాయని, గ్రామాలకు రోడ్లు, వైకుంఠ ధామాలు, రైతు వేదికలకు నిధులు సమకూర్చింది బీజేపేనని చెప్పారు.


మహిళలతో మాట్లాడుతున్న కొండా

ఆ పార్టీలను ప్రజలు నమ్మరు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు వందరోజుల్లో అమలు చేస్తామని చెప్పిన వాటిని అమలు చేయటంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రమని చెప్పిన కేసీఆర్.. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దివాలా తీయించారన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశంలో అవినీతి రహిత పాలన అందించిన ఘనత మోదీకే దక్కుతుందని స్పష్టం చేశారు. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం, మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. యాత్రలో భాగంగా పార్టీలో చేరిన వారికి కొండా కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, మైలార్ దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాల నాయకులు రాములుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణాగౌడ్, శర్వలింగం, వెంకట్‌రామ్ రెడ్డి, నాగరాజు, అశోక్, నాయకులు నరింలు, సురేశ్, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్న, దినేశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, అభిలాస్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌పీ గెలుపునకు కృషి చేయండి


మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కడ్తాల్: మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నాయకులతో చర్చించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు 35 వేలకు పైగా మెజార్టీ వచ్చిందని, త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి మునుపటి కంటే, ఎక్కువ మెజార్టీతో ప్రవీణ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

యువ నాయకుడిపై సస్పెన్షన్ ఎత్తివేత


ఎమ్మెల్యే సబితకు ధన్యవాదాలు తెలుపుతున్న వాసుబాబు

పహాడీషరీఫ్: పార్టీలో కొనసాగుతున్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఎమ్మెల్యే సబితారెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల బీఆర్ఎస్ నాయకుడు కాట్రగడ్డ వాసుబాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే సబిత, యువ నాయకుడు కార్తీక్ రెడ్డిలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వాసు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందిన సందర్భంగా తన ఆవేదనను వ్యక్తపరిచిన సమయంలో.. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు తనపై సస్పెన్షన్ వేటు వేశారని తెలిపారు. తీరా చూస్తే ఆయనే స్వార్థంతో కాంగ్రెస్‌లో చేరిపోయారని విమర్శించారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం అందరితో కలిసి ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనకు సహకరించిన సుభాష్ రెడ్డి, డి.రమేష్ ముదిరాజ్, పచ్చ శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ దొంగ అరెస్టు

షాద్‌నగర్‌రూరల్: రాత్రి వేళల్లో వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగతనంగా తీస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. డీఐ రాంరెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్ ఈ నెల 6న తన ద్విచక్ర వాహనాన్ని ఇంటిముందు పార్కు చేశాడు. అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొందరు బైక్ నుంచి పెట్రోల్‌ను దొంగిలించారు. ఇదే విషయమై సదరు వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రాంరెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గణేశ్ కుమార్‌ను నిందుతుడిగా గుర్తించి, 3 లీటర్ల ఇంధనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గణేశ్‌తో పాటు మరో ఇద్దరు ఈ కేసులో ఉన్నారని, వారు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. విచారణ అనంతరం నిందితుడు గణేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు.